

మాట్లాడుతున్న నంద్యాల నరసింహారెడ్డి, పక్కన కళా జనార్దనమూర్తి

బలిజేపల్లి లక్ష్మీకాంతం సుప్రసిద్ధ రచయిత

● మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి

చిక్కడపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బలిజేపల్లి లక్ష్మీకాంతం సుప్రసిద్ధ రచయిత అని మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి అన్నారు. ఆయన రచించిన సత్యహరిశ్చంద్ర నాటకం ఇప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రదర్శిస్తూ ఉన్నారని వివరించారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా బలిజేపల్లి లక్ష్మీకాంతం యాదిలో సమావేశం తెలంగాణభాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ హిందూ కళాశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన లక్ష్మీకాంతం దేశ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ పాల్గొన్నారని, సినీ రంగంలోనూ కథారచయితగా నటుడుగానూ గుర్తింపు పొందారన్నారు. కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ స్వాతంత్ర్యయోధులు, అవధాని, నాటక రచయిత, రంగస్థల, సినీనటులు బలిజేపల్లి లక్ష్మీకాంతం వంటి మహనీయుల గురించి తెలుసుకోవడం నేటి తరానికి ఎంతో అవసరం అన్నారు. సమావేశంలో కళాపోషకులు కేతురాజు పూర్ణిమ కామేశ్వరరావు, గానసభ పాలకమండలి సభ్యురాలు గుండవరపు గీతాదేవి, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.



స్ట్రీట్‌లైట్ల పనితీరును అధికారులతో కలిసి పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావని

స్ట్రీట్‌లైట్స్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు

చిక్కడపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లో నెలకొన్న స్ట్రీట్‌లైట్స్ సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ ఎ. పావనీవినయ్‌కుమార్ అన్నారు. సోమవారం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ స్ట్రీట్‌లైట్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్‌కుమార్, ఏఈ సౌమ్య, సిబ్బంది బాలునాయక్, రాజులతో కలిసి స్ట్రీట్‌లైట్స్ పనితీరును పర్యవేక్షిస్తూ డివిజన్ వ్యాప్తంగా పర్యటించారు. పలు వీధుల్లో నెలకొన్న అంధకారం తద్వారా ఏర్పడుతున్న సమస్యలను అధికారులకు చూపించి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంధకారంలో ఉన్న ప్రతి చోటా నూతన పోల్స్, వాటికి నూతన స్ట్రీట్‌లైట్స్ ఏర్పాటు చేయడంతోపాటు పలు చోట్ల వెలగని లైట్లకు తక్షణమే మరమ్మతులు రిపేర్లు చేయాలని, వెలుతురు రాకుండా అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, డివిజన్ ఉపాధ్యక్షుడు సురేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు, నాయకులు సాయికుమార్, నీరజ్, అరుణ్‌కుమార్, జ్ఞానేశ్వర్, సాయితరుణ్, శశికాంత్ పాల్గొన్నారు.



వైద్యాధికారులతో అంబర్‌పేట క్లస్టర్ ఎస్.పీ.హెచ్.వో డాక్టర్ పద్మజ

మెరుగైన వైద్య సేవలు అందించాలి : డా. పద్మజ

ముషీరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని అంబర్‌పేట క్లస్టర్ ఎస్.పీ.హెచ్.వో డాక్టర్ పద్మజ సూచించారు. సోమవారం ముషీరాబాద్‌లోని ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో ప్రభుత్వ బస్తీదవాఖానా, యూపీహెచ్‌సీ వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రజల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని సూచించారు. ప్రభుత్వ ల్యాబ్‌లలో వైద్య పరీక్షల నివేదికలను రోగులకు సత్వరం అందజేసే విధంగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారులు డాక్టర్ మనోజ్‌రెడ్డి, బస్తీ దవాఖానా డాక్టర్ జిలానీ, హసిని, రేష్మ, అమీనా, శివ పాల్గొన్నారు.

11న మెగా జాబ్ మేళా

రాంనగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 11న నియోజకవర్గంలోని హెరిటేజ్ ప్యాలెస్‌లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సంఘసేవకులు టి.దినకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవ తరగతి, ఐటీఐ, డిప్లమా, బీటెక్, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, డిగ్రీ, ఇతర పీజీ కోర్సులు చేసిన యువతీ, యువకులు ఈ ఉద్యోగ జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని తెలిపారు. ఈ జాబ్‌మేళాలో పేరు పొందిన ఐటీ, సాఫ్ట్‌వేర్, బ్యాంక్, లాజిస్టిక్స్, ఆటోమొబైల్, ఫార్మసీ, ఇంజనీరింగ్, హాస్పటల్, హోటల్ రంగాలకు చెందిన కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. అర్హత కలిగిన వారందరికీ ఉద్యోగాలు ఇచ్చే అవకాశం కల్పిస్తున్నామన్నారు. అర్హులందరూ పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాల కోసం 8374315052 ఫోన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా కృష్ణవేణి



నల్లకుంట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా చిల్లంచర్ల కృష్ణవేణి నియమితులయ్యారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్న హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌కు తెలంగాణకు వైస్ ప్రెసిడెంట్‌గా చిల్లంచర్ల కృష్ణవేణిని సంస్థ చైర్మన్ మాధవ్ ప్రకటించి సోమవారం ఉత్తర్వులను జారీ చేసి ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంస్థ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు చైర్మన్ మాధవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి సతీష్ దేవరకొండలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పదవి బాధ్యతలు స్వీకరించిన కృష్ణవేణిని సంస్థ సభ్యులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మాదిగల అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొంపెల్లి నరేష్ తదితరులు

రాంనగర్ : అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న మాదిగల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపెల్లి నరేష్ డిమాండ్ చేశారు. జనవరి 3న రవీంద్రభారతీలో జరగనున్న రాష్ట్ర మహిళా సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సోమవారం విద్యానగర్‌లోని సంఘం కార్యాలయంలో డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, ఉచిత నిర్బంధ విద్య అమలు చేయాలని అన్నారు. జనవరి 3న జరగనున్న రాష్ట్ర మహిళా సదస్సుకు రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డ యాదయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కడతల విజయలక్ష్మి, సరస్వతి, సంపూర్ణ, శోభారాణి, మణెమ్మ, జైశీల, తిరుమల, రాణి పాల్గొన్నారు.

ఉలిక్కిపడ్డ ముషీరాబాద్

● మిట్ట మధ్యాహ్నం యువతి దారుణ హత్య
● బాపూజీనగర్‌లో విషాదఛాయలు
● బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకులు

ముషీరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్‌లో ఓ యువతి మిట్ట మధ్యాహ్నం దారుణహత్యకు గురైన సంఘటన స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఈ వార్త క్షణాల్లో వ్యాపించడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో లక్ష్మీ, కాంతారావులు పది సంవత్సరాలుగా అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు పవిత్ర(17), కావ్యలు ఉన్నారు. ఆదివారం కుటుంబ సభ్యులందరూ విజయవాడ వెళ్లి అర్ధరాత్రి బాపూజీనగర్‌లోని తమ ఇంటికి వచ్చారు. ప్రయాణం చేసి అలసిపోవడంతో అందరూ ఇంట్లోనే ఉన్నారు. సోమవారం వారి ఇంటి పక్కనే అయ్యప్ప స్వామి మహాపడిపూజ జరుగుతుండడంతో అందరూ పూజకు వెళ్లారు. పవిత్ర కుటుంబం ఇంట్లోనే ఉండడంతో యూసుఫ్‌గూడకు చెందిన వారి సమీప బంధువు ఉమాశంకర్ పవిత్ర ఇంటికి వచ్చి తమ ఇద్దరి పెళ్లి విషయంపై గొడవ పడ్డారు. ఆవేశంతో ఉమాశంకర్ వెంట తెచ్చుకున్న కత్తితో మెడ నరకడంతో తీవ్ర రక్తస్రావం జరిగి ఆమె ఇంట్లోనే మృతి చెందింది. గమనించిన పవిత్ర తల్లి లక్ష్మీ కేకలు వేస్తుండడం తో భయంతో ఉమాశంకర్ కత్తిని వదిలిపెట్టి ఇం ట్లో నుంచి పారిపోయాడు. అయ్యప్పస్వామి మహాపడిపూజ భజన జరుగుతుండడంతో తెలియని పరిస్థితి నెలకొంది. పవిత్ర తల్లి చేసిన ఆర్తనాదా లు, అరుపులు, కేకల శబ్దం ఎవరికి వినిపించకపోవడంతో చాలా సేపటి వరకు జరిగిన దారుణాన్ని ఎవరూ పసిగట్టలేకపోయారు. అయ్యప్ప స్వామి పూజ నుంచి ఒక్కొక్కరు బయటికి వస్తుండగా లక్ష్మీ ఇంటి ముందు ఏడు స్తూ కనిపించడంతో స్థానికులు ఆమెను ప్రశ్నించారు. జరిగిన విషయం చెప్పడంతో ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. భయంతో పరుగులు తీశారు. జరిగిన హత్య విషయం అందరికీ తెలియడంతో పెద్ద ఎత్తున జనం వారి ఇంటి వద్దకు చేరుకున్నారు. అయ్యో పాపం.. మంచి అమ్మాయి..ఎలా జరిగింది..ఎవరు చంపారు.. అని ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన దుర్ఘటన తలచుకుంటూ మహిళలు భయంతో వణికిపోయారు. రక్తపు మడుగులో పడి ఉన్న పవిత్ర మృతదేహాన్ని చూసేందుకు సహితం భయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్ గౌడ్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు శివ ముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, టెంట్ హౌస్ శ్రీనివాస్, బియ్యం శ్రీనివాస్, ఎయిర్‌టెల్ రాజు, కాంగ్రెస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు జి.ఎస్.చారి తదితరులు పవిత్ర కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. జనావాసాల మధ్య ఇలాంటి దుర్ఘటన జరగడం దారుణమన్నారు. ముందు జాగ్రత్త చర్యగా వారసిగూడ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఇంటి ముందు గుమిగూడిన జనం, వివిధ పార్టీల నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

● మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ



నిరసన వ్యక్తం చేస్తున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ తదితరులు

కవాడిగూడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయ సమీపంలో వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, వేముల రామకృష్ణ విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మిట్ల పేరుతో రూ.వేల కోట్లు వృథా చేయడం కాదని విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆలోచించాలని సూచించారు. రాష్ట్రంలోని 12.75లక్షల మంది విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజుల బకాయిలు దాదాపు రూ.10వేల కోట్లు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఫీజులు కట్టాలని ఒత్తిడి తీసుకువస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం పెండింగ్ ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో బీసీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఇచ్చే నిధులను ఆపి వెంటనే ఫీజు బకాయిలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నుంచి హైదరాబాద్ వరకు ఫీజుల బకాయిల కోసం పాదయాత్ర చేసిన విద్యార్థి నాయకులు రాకేష్, గోనేశ్రీ, పవన్, మోహన్, సాయి, వినయ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో ప్రజల్లో ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. సోమవారం బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్ శబరిమలకు వెళ్లడానికి ఇరుముడి కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే అయ్యప్పస్వామికి పూజలు చేసి అయ్యప్ప స్వాముల శబరిమల యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, బీఆర్ఎస్ నగర నాయకులు వల్లాల శ్రీనివాస్‌యాదవ్, డాక్టర్ శ్రీహరి, ముచ్చకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు. కవాడిగూడలో అయ్యప్పస్వామి నీలం వేణుయాదవ్ ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు హాజరై స్వామికి పూజలు నిర్వహించారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

కాలినడకన శబరిమలకు వెళ్లి వచ్చిన శివకుమార్‌కు సత్కారం

రాంనగర్ : అయ్యప్ప స్వామి దీక్ష ప్రజల్లో భక్తి, ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు దోహదం చేస్తుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. రాంనగర్ నుంచి కాలినడకన శబరిమలకు వెళ్లి వచ్చిన బాకారంకు చెందిన గురుస్వామి కల్యాణ శివకుమార్‌కు బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు టి.శంకర్ ముదిరాజ్, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావుల ఆధ్వర్యంలో సోమవారం బాకారంలోని బొమ్మలగుడిలో సత్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కల్యాణ శివకుమార్ గురుస్వామిని సత్కరించి మాట్లాడారు. 1350 కిలో మీటర్ల దూరంలో ఉన్న శబరిమలకు కాలినడకన 80మంది అయ్యప్ప స్వాములతో కలిసి వెళ్లిరావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మన్నె దామోదర్‌రెడ్డి, ముచ్చకూర్తి ప్రభాకర్, శివ ముదిరాజ్, టి.శ్రీధర్ చారి, శ్రావణ్‌కుమార్, రాజుస్వామి, రజనీకాంత్, ముక్క శ్రీనివాస్, భాస్కర్ కృష్ణ పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్, కార్పొరేటర్ పద్మ

రాంనగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని ఆజం కాంప్లెక్స్ నుంచి అయ్యప్ప స్వామి ఆలయం వరకు రూ.40లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు, సిబ్బందితో కలిసి డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీల్లో ఎమ్మెల్యే పాదయాత్ర చేసి ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను సం బంధిత అధికారులకు చెప్పి వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రారంభిస్తున్న నూతన రోడ్డు మధ్య తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్లు లీకవుతున్నాయని వాటికి రోడ్డు వేయడం కంటే ముందు ఈ పనులు పూర్తిచేసి రోడ్డు నిర్మాణం చేయాలన్నారు. రోడ్డు నిర్మాణంలో జాప్యం జరగకుండా నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకట్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ డీఈ ప్రశాంతి, ఏఈ పృథ్వీ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవి, జలమండలి డీజీఎం విష్ణువర్ధన్‌రావు, సూపర్‌వైజర్ బాలకృష్ణ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీ.హెచ్.చంద్రమోహన్, నాయకులు శ్రీరాములు ముదిరాజ్, అఫ్రోజ్‌పటేల్, రమేష్, మిరియాల శ్రీనివాస్, కెంచె మహేష్, కోట్ల సంతోష్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

● పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సయ్య



మాట్లాడుతున్న అధ్యక్షుడు గాజుల నర్సయ్య

రాంనగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ డీఏలను సత్వరం విడుదల చేయాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల నర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు 15 రోజుల్లో పరిష్కరించకపోతే నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడులతూ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 010 పద్దు కింద గ్రంథాలయ సంస్థలో రిటైర్డ్ అయిన ఉద్యోగుల జీతభత్యాలు విడుదల చేయాలన్నారు. వేములవాడ, యాదాద్రి, భద్రాచలం మార్కెట్ కమిటీ సహకార సంస్థలు, గ్రంథాలయాలు వాటర్ వర్క్స్ సంస్థలో పదవీ విరమణ పొందిన రిటైర్డ్ ఉద్యోగులకు సత్వరమే హెల్త్‌కార్డులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, నవనీతరావు, ప్రేమ్‌కుమార్, రఫీయుద్దీన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్యవైశ్యులు సత్తాచాటాలి

● ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ముషీరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్యవైశ్యులు సత్తాచాటాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నా రు. సోమవారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా ఆర్యవైశ్యులు స్థానిక సంస్థ ఎన్నికల్లో తమ సత్తా చా టాలని సూచించారు. ఎన్నికల్లో పోటీచేసే ఆర్యవైశ్యులకు అన్నివిధాల అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, వాసవి ఆస్పత్రి చైర్మన్ జయప్రకాష్ రామ్, యూత్ కమి టీ అధ్యక్షుడు రవిగుప్తా, చంద్రశేఖర్, నారాయణ, ఉప్పల స్వప్న పాల్గొన్నారు.

రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై ఉన్న చిత్తశుద్ధి రిజర్వేషన్లపై ఎందుకు లేదు

● బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్



మాట్లాడుతున్న బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

రాంనగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై ఉన్న చిత్తశుద్ధి బీసీ రిజర్వేషన్లపై ఎందుకు లేదని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, వైస్ చైర్మన్ సుగురి దుర్గయ్యగౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్‌లు ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వానికి రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై ఉన్న చిత్తశుద్ధి బీసీ రిజర్వేషన్లపై చూపి ఉంటే ఇప్పటికే పార్లమెంట్‌లో 42శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత వచ్చేదన్నారు. సోమవారం చిక్కడపల్లిలోని ఫ్రంట్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధానిమోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీలను డిప్యూటీ సీఎం పార్లమెంట్ సభ్యులతో వెళ్లి ఆహ్వానించారని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై ప్రస్తావించకుండా ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని అబద్ధాలు చెప్పడం సరైంది కాదన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో మద్దతు కోసం ఎందుకు పంపించలేదో సీఎం సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు తీసుకువచ్చే వరకు రాజీలేని పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫ్రంట్ నాయకులు అంబాల నారాయణగౌడ్, బోయ గోపీ, వి.నాగభూషణం, నరేష్ పాల్గొన్నారు.

ఓయూకు సీఎం రాకను స్వాగతిస్తున్నాం

రాంనగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీకి రూ.వెయ్యి కోట్లు నిధులు మంజూరు చేస్తూ ప్రపంచ స్థాయి యూనివర్సిటీలకు దీటుగా అభివృద్ధి చేయడానికి ఈనెల 10న ఓయూకు రానున్న సీఎం రేవంత్‌రెడ్డికి విద్యార్థులు, విద్యార్థి సంఘాల తరఫున స్వాగతం పలుకుతున్నామని విద్యార్థి జనసమితి అధ్యక్షుడు మాసంపల్లి అరుణ్‌కుమార్ తెలిపారు. యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగ భర్తీలపై స్పష్టత ఇవ్వాలని, యూనివర్సిటీ హాస్టల్స్‌లో మౌలిక వసతులను కల్పించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వాలని, ఎలాంటి ఫెలోషిప్ రాని పరిశోధక విద్యార్థులకు నెలకు రూ.20 వేల చొప్పున, పీజీ విద్యార్థులకు నెలకు రూ.7,500 చొప్పున స్కాలర్‌షిప్ ఇచ్చే విధంగా సీఎం ఆలోచన చేయాలని ఆయన కోరారు.

16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు


చిక్కడపల్లి: చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 16నుంచి వచ్చేనెల 16వరకు ధనుర్మాస వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి. రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు తెలిపారు. 16న ధనుర్మాస ఉత్సవ ఆరంభం, 25నుంచి 29వరకు పహల్‌పత్తు ఉత్సవాలు జరుగుతాయని ఈసందర్భంగా ఈ ఐదు రోజులు సాయంత్రం 6గంటలకు దేవాలయ ద్వారబంధనం జరుగుతుందన్నారు. 30న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 5గంటల నుంచి భక్తులకు వైకుంఠ ద్వారదర్శనం ఉంటుందన్నారు. 30నుంచి జనవరి 3వరకు రాపత్తు ఉత్సవాలు, 11న కూడారై ఉత్సవం, 14న భోగిపండుగ సందర్భంగా రాత్రి 7గంటలకు గోదా సమేత రంగనాథస్వామివారి కల్యాణం, 15న మకరసంక్రమణ పర్వదినం ఉత్తరాయణపుణ్యకాలం, 16న కనుమపండుగ సందర్భంగా గోదాఅమ్మవారి కరినోము ఉత్సవం జరుగుతుందన్నారు.

పరుగు పందెంలో మోహన్‌చరణ్‌కు గోల్డ్‌మెడల్

బర్కత్‌పుర, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి మోహన్‌చరణ్ 100 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకాన్ని, 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని సాధించాడు. వివేకవర్ధని ఆర్ట్స్ అండ్ కామర్స్ సైన్స్ కాలేజీ ఆధ్వర్యంలో జరిగిన అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో పాల్గొన్న మోహన్‌చరణ్ ఖోఖోలో రజిత పతకాన్ని కళాశాలకు అందించాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.చిరంజీవి మోహన్‌చరణ్‌ను సోమవారం అభినందించారు.

పురస్కారాలు ప్రోత్సాహాన్ని పెంపొందిస్తాయి

రాంనగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారికి, వివిధ రంగాల్లో రాణిస్తున్న వారికి పురస్కారాలు మరింత ప్రోత్సాహం పెంపొందిస్తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ 20వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న వారికి సేవ స్వర్ణ నంది, ఉపాధ్యాయ రత్న, సేవా భూషణ్, బాలతేజం జాతీయ స్థాయి పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జాతీయ వినియోగదారుల మండలి అధ్యక్షుడు మండడి కృష్ణారెడ్డి, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు పెంటపాటి కృష్ణాది శేషు, తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంఘం సమాఖ్య గౌరవ అధ్యక్షుడు, న్యాయవాది గౌరీశంకర్‌రావు, ప్రముఖ కవయిత్రి లయన్ డాక్టర్ సుజాతశేఖర్ తదితరులు హాజరై పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక సంస్థ అధ్యక్షుడు ఇ.ఎస్.సూర్యనారాయణ, ఇ.సూర్యతేజ, లక్ష్మి నాగేశ్వర్, ఉమాశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్‌పి శైలజ తదితరులు

ఏకరాగం- దశ సినీగీతాలు సంపుటి ఆవిష్కరణ

చిక్కడపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సినీ గీతాలలో రాగాలు తెలుసుకోవాల్సిన విశేషాలు ఎన్నో ఏకరాగం- దశ సినీ గీతాలు సంపుటిలో ఉన్నాయని ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్‌పి శైలజ అన్నారు. వంశీ ఇంటర్నేషనల్, శ్రీకృష్ణ స్వరరాగ స్రవంతి ఆధ్వర్యంలో రూపాకుల నాగేశ్వరి రచించిన ఏక రాగం-దశ సినీగీతాలు సంపుటి ఆవిష్కరణ సభ సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగింది. ముఖ్యఅతిథిగా ఎస్‌పి శైలజ పాల్గొని సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. మంచి పుస్తకం ఉత్తమ నేస్తం అని అది ఆత్మవిశ్వాసం ఇస్తుందన్నారు. విషయపరిజ్ఞానం కోసం మంచి పుస్తకాలు చదవాలి అన్నారు. అటువంటి పుస్తకం ఏకరాగం -దశ సినిగీతాలు పుస్తక రచన అని ఇది ప్రతి గ్రంథాలయంలో సంగీత శిక్షణ విద్యాలయాలలో ఉండాలని సూచించారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతంలో లిప్త స్వరాలు ఉన్నాయి అని వాటిని అన్వయిస్తూ సినీ గీతాలలో రాగ విశ్లేషణను నాగేశ్వరి తన సంపుటిలో చేశారని ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రచురణకర్త జ్యోతి వల్లబోజు, గాయని ఆమంతలను సత్కరించారు. వంశీ రామరాజు కార్యక్రమాన్ని నిర్వహించగా సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్, రాష్ట్రపతి నిలయం ఎస్టేట్ మేనేజర్ రజని ప్రియ, గాయని సురేఖామూర్తి, సంఖ్యాశాస్త్రవేత్త దైవజ్ఞశర్మ, వైఎస్ రామకృష్ణ, లలిత, సుంకరపల్లి శైలజ పాల్గొన్నారు.

గుండెపోటుతో బత్తిని శంకర్ మృతి

బర్కత్‌పుర, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నీలకంఠ సంఘం నగర అధ్యక్షుడు బత్తిని శంకర్ గుండెపోటుతో మృతిచెందాడు. కాచిగూడలో నివాసం ఉంటున్న బత్తిని శంకర్‌కు సోమవారం ఛాతిలో నొప్పిరావడంతో నివాసంలోనే మృతిచెందాడు. ఆయనకు భార్య పద్మ, కుమారుడు సుజిత్, కుమార్తెలు భవ్య, దివ్యలు ఉన్నారు. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్‌లు శంకర్ అంత్యక్రియల్లో పాల్గొని ఆయన కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

రైలులో ల్యాప్‌టాప్ చోరీపై ఎఫ్ఐఆర్

బర్కత్‌పుర, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణికుడి ల్యాప్‌టాప్ చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. హిమంత్(26) కొల్హాపూర్ రైల్వే స్టేషన్‌లో కొచ్చిన్ - నాందేడ్ రైలు ఎక్కాడు. రైలు డోన్ వద్దకు వచ్చి చూసుకునే సరికి ల్యాప్‌టాప్ బ్యాగ్ కనిపించలేదు. ల్యాప్‌టాప్ బ్యాగ్‌లో హెచ్‌పీ ల్యాప్‌టాప్, రూ. 1100 నగదు, ఏటీఎం కార్డులు, డెబిట్ కార్డులు ఉన్నాయి. రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కర్నూలు రైల్వేస్టేషన్‌కు బదిలీ చేశామని సీఐ తెలిపారు.



శ్రీధర్మశాస్త్ర సేవా సంఘం ఆధ్వర్యంలో బాగ్‌అంబర్‌పేట అయ్యప్పస్వామి ఆలయం నుంచి గోల్నాక శివాలయం వరకు ఈనెల 14న నిర్వహించనున్న పేటతుల్లి ఊరేగింపు కార్యక్రమ పోస్టర్‌ను గోల్నాక డివిజన్ శంకర్‌నగర్‌లోని తన కార్యాలయంలో అయ్యప్ప స్వాములతో కలిసి ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ - గోల్నాక, ఆంధ్రజ్యోతి